
విశాలాంధ్ర అనకాపల్లి
పేజి నెం. 6
బుధవారం 14, మే 2025

17న సివిల్స్, ఏపీపీఎస్‌సీ గ్రూప్-1పై సదస్సు

విశాలాంధ్ర - అనకాపల్లి : నిరుద్యోగుల శిక్షణా కేంద్రం, ఉపాధి కల్పనకు దిక్సూచి ప్రసిద్ధి చెందిన అనకాపల్లి శ్రీ గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17న (శనివారం) సాయంత్రం 4 గంటలకు వైజాగ్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో శ్రీ గౌరీ గ్రంథాలయంలో యుపీఎస్‌సీ (సివిల్స్), ఏపీపీఎస్‌సీ గ్రూప్-1 పోటీ పరీక్షలకు అవగాహన సదస్సు జరగనున్నదని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రధాన బోధకులుగా వైజాగ్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్ పోతల, బోధకులుగా యుపీఎస్‌సీ (సివిల్స్)-2025 విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని మానస, మరికొంతమంది నిష్ణాతులు హాజరవుతారన్నారు. సివిల్స్, గ్రూపు-1 పరీక్షల ప్రాధాన్యత, అర్హత, పరీక్ష, సిలబస్, దేశ పాలనలో సమర్ధత, ప్రజా సేవ, పాలసీల అమలు, దేశాభివృద్ధి, న్యాయం, సమర్ధవంతమైన పరిపాలన అంశాలపై సదస్సులో అవగాహన కల్పిస్తారన్నారు. ఔత్సాహిక విద్యార్థులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 9247166511కు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండల కేంద్రంలో మంగళవారం ఉదయం తాండవ ఎడమ కాలువ పూడిక తీతను మాజీ తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ పారుపల్లి కొండబాబు పరిశీలించారు. అనంతరం ఉపాధి శ్రామికులతో మాట్లాడుతూ పని కల్పించే విషయంలోనూ, అలాగే పనిలో తీసుకోవలసిన జాగ్రత్తలను శ్రామికులకు తెలియపరిచారు. ఆయన వెంట సుర్ల నాగ సత్యనారాయణ ఉన్నారు.

ఉపాధి కార్మికులకు వితరణ

విశాలాంధ్ర- మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేస్తున్న కార్మికులకు కీర్తిశేషులు దిమ్మల అచ్చయ్యమ్మ 16వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు మునగపాక గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, సోదరుడు దిమ్మల నూకరాజు కుటుంబ సభ్యులతో కలిసి పండ్లు, శీ తల పానీయాలు అందజేశారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా మంగళవారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, గ్రంథాలయాలు ప్రయోజనాలు అనే అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జగన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు జూన్ 6వ తేదీ వరకు జరుగుతాయని విద్యార్థులంతా వచ్చి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్ట్

- ఎస్ఐ రామకృష్ణారావు

విశాలాంధ్ర - రోలుగుంట: భార్యపై హత్యాయత్నం కేసులో 5 సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్న నిందుతున్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న మండలంలో బి.బి పట్నం గ్రామానికి చెందిన నిందితుడు బాకూరి రామరాజును మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతనిని అరెస్ట్ చేసి కోర్టులో ప్రొడ్యూస్ చేయగా, నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో దార్లపూడి గ్రామంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ పదవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు వచ్చి స్వామివారికి సింధూరం, తమలపాకులు పూజ చేశారు. భక్తులు దర్శించుకుని అనంతరం గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, కసింకోట నీలందరావు, పోలిశెట్టి శ్రీను, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

విశాలాంధ్ర - కే.కోటపాడు: టీనేజీ వయసులో తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల తల్లిదండ్రులు తీవ్ర మనస్తాపాలకు గురవుతున్నారు. చిన్న తగాదా యువతి ఆత్మహత్యకు దారి తీసింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇక్కడ జరిగింది. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ ధనుంజయ్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం ఈ మండలం పాచిలవానిపాలెం గ్రామానికి చెందిన పాచిల యమున (16) గతనెల 27వ తేదీన తన ట్యాబ్లో వీడియో గేమ్‌లు ఆడుతుండగా ఆమె సోదరుడు ఆ ట్యాబ్‌ను బలవంతంగా తీసుకున్నాడు. ఇద్దరూ ట్యాబ్ విషయంలో గొడవ పడుతుండగా ఆమె తల్లి వరలక్ష్మి జోక్యం చేసుకుని ఇద్దరినీ శాంతింపజేసి వ్యవసాయ పనులకు వెళ్లి పోయింది. సాయంత్రం తల్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి యమున బెడ్ రూమ్‌లో ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతుండటంతో వెంటనే ఆమెను కిందకు దించి చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అప్పటినుండి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. యువతి మేనమామ దొగ్గ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరబాబు

విశాలాంధ్ర - అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20న జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను కాలరాసే కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి కార్మిక వర్గం బుద్ధి చెప్పడానికి ఈ సమ్మె కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం సివిల్ సప్లై యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె జయప్రదం సమావేశం నిర్వహించారు. సమావేశంలో దొరబాబు, త్రినాధ్ మాట్లాడుతూ ప్రతినెల 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులుగా ఎందుకు గుర్తించలేదని దొరబాబు ప్రశ్నించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన, ఆటో, ముఠా కార్మికులకు సమగ్రమైన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకి 600 చొప్పున చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వియ్యపు రాజు, వి.సింహాచలం, గోవిందరావు, నాగ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలంటూ ఆందోళన

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామంలో నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు లేవని తెలిపారు. పంచాయతీ నుంచి ఎన్ఓసి కూడా లేదని తెలిపారు. సెల్ టవర్‌ను సాగునీటి కాలువ సమీపంలో నిర్మించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ నిబంధనలను అతిక్రమించి సెల్ టవర్ నిర్మిస్తున్నారని తెలిపారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేశారని, మరల పనులు ప్రారంభించారని అన్నారు. సెల్ టవర్ నిర్మాణం కారణంగా రేడియేషన్ పెరిగి, ప్రజలు రోగాల బారిన పడతారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీను, లెక్కల నాగేశ్వరరావు, వేముల గంగా మహేష్, వేముల గోపి, తూము నాగేశ్వరరావు, తూము సాయి, వేముల నాగరత్నం, వేముల వీరలక్ష్మి, తిరుమల శెట్టి లక్ష్మి, తిరుమల శెట్టి అనంతలక్ష్మి, లెక్కల వెంకటలక్ష్మి, తూము శివమ్మ, వేముల గన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీ విధుల నుండి మినహాయింపునివ్వాలి

ఎంపీడీఓకు అంగన్వాడీ వర్కర్ల వినతి

విశాలాంధ్ర. - సబ్బవరం: మండలంలోని అంగన్వాడి వర్కర్స్‌కు పెన్షన్ పంపిణీ విధుల నుండి మినహాయింపునివ్వాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.వి. రమణమ్మ స్థానిక ఎంపీడీఓ పి.పద్మజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్‌కు రకరకాల యాప్‌ల వలన పనిభారం పెరిగిందని, అయినా ప్రభుత్వం వచ్చిన కొత్తలో గ్రామాల్లో పెన్షన్ పంపిణీలో సచివాలయం సిబ్బందికి రెండు మూడు నెలలు సహకరించాలని కోరిన మీదట తాము అంగీకరించామని, పెన్షన్ పంపిణీ చేసిననప్పుడల్లా అదే సమయంలో అదే కొనసాగింపుగా పింఛను అమౌంట్ కూడా అంగన్వాడి కార్యకర్తలకి ఇచ్చి కొన్ని చోట్ల పెన్షన్ పంపిణీ చేయమంటున్నారని ఆమె వాపోయారు. 1వ తేదీ నుంచి పిల్లల బరువు తీయడం, టిహెచ్ఆర్ పంపిణీ చేయడం, పిల్లలకు పోషకాహారం వండి పెట్టడం, ప్రీ స్కూల్ నిర్వహించటం, యాప్‌లో అప్లోడ్ చేయడం వంటి అనేక పనులతో సతమతమవుతున్న పరిస్థితులలో పింఛను పంపిణీ విధులను నిర్వహించలేమని తేల్చి చెప్పారు. ఇటీవల గుంటూరులో రాజకీయ జోక్యం వలన ఒక వర్కర్‌ను సస్పెండ్ చేశారని గుర్తు చేసారు. అలాగే అంగన్వాడి సెంటర్ విధుల నిర్వహణకు ఆటంకంగా కూడా ఉంటుందని, కావున ప్రభుత్వం తమ బాధలు అర్థం చేసుకుని పెన్షన్ డ్యూటీ నుంచి అంగన్వాడీ వర్కర్స్‌లను మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులు అభివృద్ధికి సహకరించండి

ఇరిగేషన్ డీఈ ఎం.వి.సురేష్ కుమార్

విశాలాంధ్ర - యస్.రాయవరం: గ్రామాల్లో సాగునీటి వనరుల అభివృద్ధికి సహకరించాలని పాయకరావుపేట ఇరిగేషన్ డీఈ ఎం.వి.సురేష్ కుమార్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో గల సాగునీటి వనరుల సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి సంఘాల పరిధిలో కాలువలు, చెరువులు అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని అత్యవసరంగా చేయవలసిన ఇరిగేషన్ పనులను ప్రతిపాదన పంపించడం జరిగిందని వాటిని త్వరలో చేపట్టడం జరుగుతుందని అన్నారు. కొన్ని సంఘాల అధ్యక్షులు తమ పరిధిలో ఎప్పటినుంచో సమస్యగా ఉన్న పనులను పూర్తి చేయాలని కోరారు. చెప్పిన వాటిని పరిశీలించి ప్రతిపాదనలు పంపిస్తామని డీఈ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ అమీనా భాను, మాజీ ఎంపీపీ వై.వినోద్ రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టిడిపి సీనియర్ నాయకులు వెంకటరాజు, గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీబిఎస్ఈ 10, ప్లస్2 ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థుల విజయకేతనం

విశాలాంధ్ర - పాయకరావుపేట: సీబీఎస్ఈ ప్రకటించిన పదవ తరగతి, ప్లస్2 ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ ప్రకాష్ తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో ఎన్.సత్య సాయి 483/500, ఎం.యశస్వి 482/500, పి.తరుణ్ కుమార్ 481/500, ఎస్. రఘు నందన్ 478/500 మార్కులతో అగ్రగాములుగా నిలిచారని తెలిపారు. అలాగే ప్లస్2 ఫలితాల నందు జి. సాయి అనీష్ 469/500, ధాత్రి నిహారిక 466/500 సాధించి అగ్రగాములుగా నిలిచారని తెలిపారు. నూటికి నూరుశాతం ఉత్తీర్ణతా శాతంతో తమ విద్యార్థులు మాథ్స్, సైన్స్ సబ్జెక్టుల నందు 100 కి 100 మార్కులు సాధించడం హర్షణీయమని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు అభినందించారు.

దేశావ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - చీడికాడ: ఈనెల 20న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ సభ్యులు మంగళవారం గోడ పత్రికను విడుదల చేశారు. స్థానిక యంపియుపి పాఠశాలలో జరిగిన సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి ఉద్యోగులు, కార్మికులకు కనీస ప్రాథమిక హక్కులు లేకుండా చేస్తోందన్నారు. ఉద్యోగభద్రత సమ్మె చేసే హక్కు లేకుండా యజమానులకూ అనుకూలంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో చట్టం చేయడానికి సిద్ధపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎం.జానకి, డి.ఉమా, పైడితల్లమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో అపారిశుధ్యం

- ప్రబలుతున్న అంటువ్యాధులు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండల పరిషత్ పరిధిలో గల 32 గ్రామ పంచాయతీల్లో రోడ్లుకు ఇరువైపులా చెత్త కుప్పలు, మలమూత్ర విసర్జనలుతో అపారిశుధ్యం తాండవిస్తోంది. దీంతో అంటురోగాలు ప్రబలుతున్నాయి. గ్రామాలకు సరియైన రహదారి సౌకర్యం లేక, ఉన్న రోడ్లు గోతులమయంగా మారడంతో బిక్కుబిక్కుమంటున్న గ్రామస్తులు అపారిశుధ్యంతో అంటు రోగాల పాలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకులు, ప్రభుత్వ అధికారులు పంచాయతీల ఊసే ఎత్తకపోవడంతో మండల పరిధిలో గల గ్రామ పంచాయతీల్లో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. క్లోరినేషన్ లేక తాగునీరు తరచూ కలుషితమవుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు సమయంలోను, నాయకులు వచ్చేటప్పుడు మాత్రమే పంచాయితీ సిబ్బంది గ్రామాల్లో బ్లీచింగ్ జల్లుతూ హడావిడి చేస్తుంటారని స్థానికులు చెప్తున్నారు. అపారిశుధ్యం, కాలుష్యం మధ్య ప్రజలు బిక్కు బిక్కుమని జీవనం సాగిస్తుంటే నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మీడియాకు ఫోజులిస్తూ ఊక దంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని గ్రామస్థాయిలో పంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు శ్రద్ధ వహించవలసిందిగా గ్రామస్తులు ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమ్మర్ క్యాంపునకు విశేష స్పందన

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో సమ్మర్ ఒరియంటేషన్ ప్రోగ్రామ్ కొనసాగింది. గ్రంధాలయాధికారిణి దమయంతి మాస్ రీడింగ్ చేయించారు. గ్రంధాలయాలలో వివిధరకాల పుస్తకాలు చుడవడం వలన, అన్ని విషయాలలో మంచి జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని వివరించారు. గ్రంధాలయాల వలన ఉపయోగాలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ మాట్లాడుతూ మలేరియా నియంత్రణ కోసం విశేషంగా కృషిచేసి నోబెల్ బహుమతిని పొందిన సార్ రోనాల్డ్ రాస్ జయంతి సందర్భంగా అతని కోసం విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంనకు 39 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో శ్రీ మోదకొండమ్మ జాతర సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కే.మూర్తిబాబు ఆధ్వర్యంలో మంగళవారం గడ్డి సేయర్లతో గ్రామంలో ముమ్మరంగా పిచ్చి తుప్పలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పండుగ నేపథ్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని చెప్పారు.

సేంద్రీయ పంటలపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం సేంద్రియ పంటలపై గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ బయలుపూడి దేముడు, మాజీ ఆర్ఇసిఎస్ చైర్మన్ కోటాన అప్పారావు, ప్రతిభ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్లో వ్యవసాయం వేయడం వల్ల కలిగిన లాభాల గురించి వివరించారు. ఈ సేంద్రియ ఎరువులు లో22 రకాల పోషకాలు భూమిలో పెరగడానికి, భూమి గుల్ల బారి ప్రధాన పంటకు పోషకల అందజేసి ఖర్చు తగ్గి ఆదాయం పెరిగే విధంగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.అదే విధముగా ఆకుకూరలు కాయగూరలు మన ఇంటి దగ్గర తోటలు వేసుకోవడం వల్ల కలిగేలా లాభాలు గురించి వివరించారు. అలాగే సేంద్రియ ఎరువులు వ్యవసాయ పంటలు అధిక దిగుబడులు పొందవచ్చని ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి పాలెం గ్రామానికి బెస్ట్ ఫార్మర్స్‌ను ప్రతిభ కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, కోటన రాము ఇద్దరును ఘనంగా సత్కరించారు. అనంతరం సేంద్రియ వ్యవసాయంపై ఫ్లెక్సీలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం. టి వెంకట సత్యవతి, ఎల్ఐ లక్ష్మణరావు, శ్రీనివాస్,కనకమహాలక్ష్మి, సాయి కుమారి,రాధా, రైతులు పాల్గొన్నారు.

నేడు మాక్‌డ్రిల్

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్: శత్రు దాడి పరిస్థితి సంభవించి నప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై బుధవారం ఉదయం మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జిల్లా కలెక్టరు, జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి తెలిపారు. భారతదేశంలో శత్రు దాడి పరిస్థితి సంభవించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించు నిమిత్తం రెవిన్యూ డివిజినల్ అధికారి, అనకాపల్లి వారి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అనకాపల్లి జిల్లాలో గల అత్యవసర సంసిద్ధత పై పట్టణ ప్రాంతాలలో అవగాహన కల్పించేందుకు గాను 14వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ, బైపాస్ రోడ్, జయభేరి మారుతీ షోరూం ఎదురుగ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సదరు బృందం శత్రు దాడి పరిస్థితి సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడునని తెలియజేసారు.

బంగార్రాజు తల్లిదండ్రుల విగ్రహాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - నర్సీపట్నం: జాలుమూరి బంగార్రాజు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని, వారి తల్లితండ్రులు స్వర్గీయ జాలుమూరి జోగారావు, తల్లి జాలుమూరి నూకరత్నం విగ్రహాలను నర్సీపట్నంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొని, జాలుమూరి బంగార్రాజుకి 75వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వర్గీయ జాలుమూరి జోగారావు నర్సీపట్నంలో వ్యాపార రంగంలో శ్రీకారం చుట్టిన ప్రముఖులు అని, వారి తాతగారు లత్సాపాత్రుడు కుటుంబంతో తాను కలిగిన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా పేదల కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో జాలుమూరి బంగార్రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో కొత్త రేవు పోలవరం గ్రామంలోని ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు ముగిశాయి. బంగారమ్మ తల్లి జాతర పురస్కరించుకొని కొత్త రేవు పోలవరం మాజీ సర్పంచ్ చోడిపల్లి బంగారి సహకారంతో ఏర్పాటు చేసిన పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు వారం రోజులుగా క్రికెట్ ఆడటం జరిగింది. అందులో మొదటి స్థానం నిలిచిన మైలపల్లి ఎర్రయ్య టీంకు 30 వేల రూపాయలు, రెండో స్థానంలో నిలిచిన పల్లేటి దాసు టీంకు 20 వేల రూపాయల నగదును శ్రీ ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.సీతారామ రాజు, టిడిపి సీనియర్ నాయకులు ఎన్.వెంకట్రాజు చేతుల మీదుగా అందజేశారు. ఇటువంటి పోటీలను ఏర్పాటుచేసి ఆర్థికంగా సహకరించిన మాజీ సర్పంచ్ చోడిపల్లి బంగారిని అభినందించారు. మరిన్ని క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల పట్ల మక్కువ పెరుగుతుందని ముఖ్య అతిథులు అన్నారు.